నేడు డయల్ యువర్ డీఎం

కాచిగూడ, ఏప్రిల్ 26 : బస్సుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు నేడు(శనివారం) మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు, సందేహాలు, సలహాలు తెలియజేయాలంటే 9000406069 నంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న విజ్ఞాన భారతం నాటకం

రవీంద్రభారతి,ఏప్రిల్ 26 : పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ నాటక, నాటిక పోటీలు-2024 శుక్రవారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. డా.రామన్ ఫౌండేషన్ , సాయిబాబ నాట్యమండలి, విజయవాడ వారి ఆధ్వర్యంలో రచన దర్శకత్వం డాక్టర్ పి.వి. యన్. కృష్ణ రూపొందించిన విజ్ఞాన భారతం నాటకం, కావూరి సత్యనారాయణ, దర్శకత్వం ఏపూరి హరిబాబు రూపొందించిన అమృత హస్తం నాటిక, యం .సంజీవి, దర్శకత్వం వేంపాటి రమేశ్ రూపొందించిన భూగోళం నాటిక, రచన, దర్శకత్వం పరమాత్ముని శివరాం రూపొందించిన దారుణం నాటిక, పక్కింటి మొగుడు హాస్య నాటిక, మూల్యం నాటకకను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి వెంకటేశ్వరావు, పరుచూరి గోపాలకృష్ణ విచ్చేసి మట్లాడుతూ..అంతరించి పోతున్న నాటక, నాటికలను పరిరక్షించుకోవాలని అన్నారు.

హైదరాబాద్ లోక్‌సభ ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – మెహిదీపట్నం

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా మహ్మద్ వలిఉల్లా సమీర్ పేరును కాంగ్రెస్ ప్రకటించడంతో కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ అల్ హజారి, సీనియర్ నాయకులు తూముకుంట అరుణ్‌కుమార్‌లు చాదర్‌ఘాట్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. – అబిడ్స్, ఏప్రిల్ 26

పద్మారావుగౌడ్ గెలుపు ఖాయం

నల్లకుంట డివిజన్ గోల్నాక మార్కెట్ పరిసర ప్రాంతాలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్

ప్రచారానికి అపూర్వ స్పందన
ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం

అంబర్‌పేట, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి, ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని చర్చిగల్లీ నుంచి కూరగాయల మార్కెట్, హనుమాన్‌నగర్, అంబేద్కర్‌నగర్, వెంకటేశ్వరనగర్, భాగ్యనగర్, ముంతాజ్ స్కూల్‌గల్లీ తదితర ప్రాంతాలలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు పరిచిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తనను ఎంపీగా గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పద్మారావు ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. బస్తీలలో పూలవర్షం కురిపించారు. బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అంబర్‌పేటలో బలమైన శక్తిగా బీఆర్ఎస్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలమైన శక్తిగా ఉందని, మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగపరుచుకున్న లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటారని గోల్నాక డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు భరత్‌రాజ్ ముదిరాజ్ అన్నారు. పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్, అడ్డీఖాల్కానా ప్రాంతాల్లో కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రజల కోసం కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. కాలేరు రామకృష్ణ, రాజన్, యూసుఫ్‌షరీఫ్, అక్రమ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

చిక్కడపల్లి: పథకాలను అమలు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా గురువారం ముఠా జయసింహ గాంధీనగర్ డివిజన్ వీవీగిరినగర్ తదితర ప్రాంతల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సీఎంగా కేసీఆర్ లేక పోవడంతో ప్రజలందరూ అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, నాయకులు ముఠా నరేశ్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, పాశం రవి, ఎ. శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, , హరికృష్ణగౌడ్, వంశీ, ఎస్టీ ప్రేమ్, హన్మంతు, నవీన్, దేవయ్య, విఠల్, బన్నీ, సుధాకర్, గణేశ్, ఎం. పద్మ, వనజ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

కవాడిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలని భోలక్‌పూర్ బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జులు మహ్మద్ అస్లాం, రాజ్ మనోహర్ కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో బీఆర్ఎస్ భోలక్‌పూర్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జులుగా నియమితులైన మహ్మద్ అస్లాం, రాజ్ మనోహర్‌లను డివిజన్ కమిటీ అధ్యక్షుడు వై. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఎ. శంకర్ గౌడ్, మహ్మద్ అలీ, కృష్ణ, మహేశ్‌కుమార్, పబ్బ కృష్ణ, జబ్బార్, మక్బూల్, సుదర్శన్, ప్రవీణ్ కుమార్, కల్యాణ్, ఉమాకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేస్తున్న ముఠాజయసింహ తదితరులు



నెహ్రూనగర్‌లో పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న భరత్ ముదిరాజ్, కాలేరు రామకృష్ణ తదితరులు

హిందీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్

ప్రజల సహకారంతో విజయం సాధిస్తాం

బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్, ఏప్రిల్ 26 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి ప్రజల మద్దతు కూడగడుతున్నట్లు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మతాలను అడ్డం పెట్టుకుని ఓట్లు అడిగే వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీల హామీలిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కటి కూడా నెరవేర్చలేదని తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్ ధన్‌రాజ్, పి నరేందర్ యాదవ్, వినోద్‌యాదవ్, జైశంకర్, శ్రీనివాస్ గౌడ్, మాణిక్‌లత, జగపతి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో గెలిచేది బీఆర్ఎస్సే .. ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఎన్నిల కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 26: సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మరో మారు బీఆర్ఎస్‌ను గెలిపించబోతున్నారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ముషీరాబాద్ డివిజన్ పార్శిగుట్టలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా వ్యవహరించి, ప్రజల మద్య ఉండే పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని, తద్వారా నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, ఎడ్ల హరిబాబు యాదవ్, టి. సోమసుందర్, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, శివముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, ఆర్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులను సత్కరించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, సయ్యద్ అస్లాం, శ్రీధర్ చారి, శంకర్ ముదిరాజ్, కిరణ్ – ముషీరాబాద్

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, ఏప్రిల్ 26: అంకితభావంతో పని చేశానని, కేంద్ర ప్రభుత్వ నిధులతో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశానని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు వై.అమృత, కన్నె ఉమారమేష్‌యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు ఇ. అజయ్‌కుమార్, పవన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, కె.బి.నర్సింగ్‌రావులతో కలిసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశానికి సేవచేసే అవకాశం సికింద్రాబాద్ ప్రజలు కల్పించారన్నారు. గత తొమ్మిదేండ్లలో రూ.10 లక్షల కోట్టు కేంద్రం తెలంగాణలో ఖర్చు చేసిందని చెప్పారు. అంబర్‌పేట ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి నేటి కేంద్ర మంత్రి వరకు సేవ చేస్తూనే పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు.

నాంపల్లిలో..

మెహిదీపట్నం : నాంపల్లి నియోజకవర్గంలో శుక్రవారం సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి జీపు యాత్ర నిర్వహించారు. మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్ డివిజన్‌లలో జీపుయాత్ర చేసి బీజేపీకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి అన్నపురం రమేశ్‌కుమార్, నియోజకవర్గం కన్వీనర్ పవన్‌కుమార్, నేతలు ముఖేశ్‌కుమార్, జగన్నాథ రాజు, ఐలయ్య, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం.. యువకుడి రిమాండ్

కాచిగూడ,ఏప్రిల్ 26: పెండ్లి చేసుకుంటానని ఓ మైనర్‌కు మాయమాటలు చెప్పి కొన్ని రోజులు సహజీవనం చేసి, మోఖం చాటేసిన యువకున్ని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లికి చెందిన సాయికిరణ్ (26) లేబర్. తిలక్‌నగర్‌కు చెందిన 17ల మైనర్‌తో పరిచయం పెంచుకొని. ఆమెతో కలిసి పలు ప్రాంతాల్లో తిరుగుతూ పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమె పై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తురువాత మొఖం చేటేయడంతో పెండ్లి చేసుకోవాలని సాయికిరణ్‌ను నిలదీసింది. అతను ఒప్పుకోక పోవడంతో మోసం పోయినట్లు గ్రహించిన మైనర్ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్సై నరేశ్ శుక్రవారం సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా సాయికిరణ్ అందమైన అమ్మాయిలను పరిచయం చేసుకొని మాయమాటలు చెబుతూ లొంగతిసుకోవడం. కొన్ని నెలలు గడిపిన తరువాత మాయమాటలు చెబుతూ మొఖంచాటేస్తాడని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోల్నాక, ఏప్రిల్ 26 : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం మధ్యాహ్నం పటేల్‌నగర్ విక్టోరియా హోటల్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతుడు సుమారు (70) ఏండ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతుడి ఒంటిపై వైట్ షర్ట్, బ్లాక్ పైంట్‌తో పాటు చేతికి వాచ్ ఉందన్నారు. మృతిడి సంబంధీకులు ఎవరైనా ఉంటే వెంటనే అంబర్‌పేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

కాచిగూడ,ఏప్రిల్ 26: చేపలు పట్టడానికని పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్(25) వెల్డర్. గురువారం రాత్రి చెరువులో చేపలు పట్టడానికి స్నేతులతో కలిసి వెళ్తూ ఉందానగర్-తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఇమ్రాన్‌ఖాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్ తదితరులు

29న కురుమల ఆత్మీయ సమ్మేళనం

అబిడ్స్, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ పార్టీ మొదటి అధ్యక్షుడు, గాంధీభవన్ నిర్మాణానికి పాటు పడిన కొల్లూరి మల్లప్ప చిత్రపటాన్ని గాంధీభవన్‌లో ఏర్పాటు చేయాలని టీపీసీసీ కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, సీనియర్ నాయకుడు అరుణ్‌కుమార్, మేడ్చల్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చౌదరిపల్లి పర్వతాలు, న్యాయవాది గొరిగె మల్లేశ్, ఓయూ విద్యార్థి నాయకులు కొంగొల్ల పాండు కోరారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీన రాష్ట్రంలోని కురుమ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసేందుకు గాను చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నామని, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు పలువురు మంత్రులు పాల్గొంటారని వివరించారు. కురుమ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కురుమల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణాలు

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 26 : కబ్జా రాయుళ్లు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. సాక్షాత్తు శ్రీ ఎల్లమ్మ దేవాలయ భూములకే ఎసరు పెట్టారు. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న జియాగూడ 2జే బస్‌స్టాప్ వద్ద శ్రీ ఎల్లమ్మ దేవాలయానికి చెందిన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో కొందరు కబ్జాదారులు కిరాయి గుండాలతో జేసీబీల సహాయంతో భూమిని చదును చేసి ప్రహరీ నిర్మాణానికి తవ్వకాలు చేపడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు, బస్తీ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. వీరితో పాటు బజరంగ్‌దళ్, హిందూవాహిని, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు. కమిటీ సభ్యులు కట్టా రాజయ్య, గుర్రం లక్ష్మణ్, విజయానంద్, రాజేందర్ డేగన్, చెరక బాబు స్థానిక కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను ఆపి వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కబ్జాదారులు అక్రమ నిర్మాణం చేపడుతున్న స్థలం ఎల్లమ్మ దేవాలయానిదేనని ఈ భూమికి చెందిన కేసు కోర్టులో నడుస్తుందని అన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నా అక్రమ నిర్మాణాలను చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కబ్జాకు గురైన శ్రీ ఎల్లమ్మ ఆలయ స్థలం

ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు

అబిడ్స్, ఏప్రిల్ 26 : న్యూ ఉస్మాన్‌గంజ్‌లోని చారిత్రాత్మక శ్రీ నల్లపోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాలకు శుక్రవారం మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు విక్రంగౌడ్ దంపతులు ముఖ్య అతిథిగా పాల్గొనగా పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీకే మూర్తి ఆధ్వర్యంలో గోపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విక్రంగౌడ్ మాట్లాడుతూ.. తన తండ్రి ముఖేశ్‌గౌడ్ జ్ఞాపకార్థం గోషామహల్ నియోజకవర్గంలో మొత్తం 21 ఆలయాల పునః నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే కట్టెలమండి, పటేల్‌నగర్, ఉస్మాన్‌గంజ్‌లోని మూడు ఆలయాలు పూర్తి స్థాయిలో పునః నిర్మాణం చేయించి పునఃప్రతిష్ఠ చేసినట్లు తెలిపారు.

న్యూ ఉస్మాన్‌గంజ్‌లోని నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ అమ్మ వార్ల ఆలయ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్న విక్రంగౌడ్

నలభై ఏండ్లుగా మజ్లిస్ పాతబస్తీని విస్మరించింది

అబిడ్స్, ఏప్రిల్ 26 : నలభై సంవత్సరాలుగా హైదరాబాద్ నగరాన్ని పూర్తిగా విస్మరించిన మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడించి బీజేపీని గెలిపించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజల సంపూర్ణ మద్దతుతో రెండు లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆమె గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి. పాండుయాదవ్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, మంగళ్‌హాట్ కార్పొరేటర్ ఎం. శశికళ కృష్ణ, గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం. కృష్ణ, రాష్ట్ర బీజేపీ నాయకులు బంగారు సుధీర్‌కుమార్, వనమాల గోపాల్ తదితర నాయకులతో ఆమె ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, దయానంద్, మయూర్, కాజల్, రేణుక, రామకృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎండీలైన్స్‌లో ఎంఐఎం ప్రచారం

కార్వాన్ నియోజకవర్గం గోల్కొండ ఎండీలైన్స్‌లో ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా శుక్రవారం ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – మెహిదీపట్నం ఏప్రిల్ 26

మహిళ అదృశ్యం

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 26: మహిళ అదృశ్యమైన ఘటన శుక్రవారం సుల్తాన్‌బజార్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన ప్రకారం.. హైదర్‌గూడ అత్తాపూర్‌కు చెందిన పోల అనిత(35) కొంత కాలంగా మానసిక అస్వస్తతతో బాధపడుతున్నది. శుక్రవారం ఉదయం 9 గంటలకు అనితను తన మేనత్త భారతమ్మ వైద్య చికిత్సల నిమిత్తం ఎర్రగడ్డ వైద్యాలయానికి తీసుకెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కోఠి ఈఎన్‌టీ దవాఖాన బస్‌స్టాప్‌లో భారతమ్మ బస్సుదిగగా అనిత దిగలేదు. తరువాత వెతికినా కనిపించక పోవడంతో సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక క్వారీలో అక్రమ వసూళ్లను అరికట్టాలి

మహేశ్‌దత్‌కు వినతిప్రతం సమర్పిస్తున్న సుర్వీ యాదయ్యగౌడ్

రవీంద్రభారతి, ఏప్రిల్ 26: తెలంగాణ వ్యాప్తంగా టీఎస్ఎండీసీ నిర్వహిస్తున్న ఇసుక క్వారీలో రూ. 3,500 అక్రమ వసూళ్లను వెంటనే అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర లారీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎస్ఎండీసీ ఇన్‌చార్జి ఎండీ, ప్రిన్సిపల్ సెక్రటరి మహేశ్‌దత్ ఎక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లా ఇసుక క్వారీలో దొడ్డు ఇసుక సన్న ఇసుక పేరిట రూ.5,000 నుంచి 7000 వేలు తీసుకుంటున్నారని యాదయ్య గౌడ్ అన్నారు. గుండు లింగన్నగౌడ్, లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కవాడిగూడ, ఏప్రిల్ 26: భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మసూద్, నగర ఉపాధ్యక్షుడు ఖిరత్ అలీ బాబా, భోలక్‌పూర్ మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు మహ్మద్ యాసిన్, ప్రధాన కార్యదర్శి మిప్జా షబ్బీర్ అలీ, బీఆర్ఎస్ భోలక్‌పూర్ ఉపాధ్యక్షుడు అలీ అక్బర్, మహ్మద్ ఐజాజ్ అజ్జు, మోద్ అజ్జాజ్‌లు అంజన్‌కుమార్ యాదవ్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్‌ల సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. అంజన్‌కుమార్ యాదవ్ వారికి కాంగ్రెస్ కాండువాను కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరిన కనకయ్యముదిరాజ్